‘ఆరోగ్యశ్రీ’పై నీలినీడలు?

- బడ్జెట్‌లో రూ.1143 కోట్ల కేటాయింపు
- పెండింగ్ బకాయిలే రూ.1200 కోట్లు

హైదరాబాద్, మార్చి 20 (నమస్తే తెలంగాణ): ఇక ‘ఆరోగ్యశ్రీ’ కనుమరుగు కానున్నదా? ఈ పథకం ద్వారా పేదలకు అందాల్సిన కార్పొరేట్ వైద్య సేవలు నిలిచిపోనున్నాయా? అంటే అవుననే సమాధానమే వినిపిస్తున్నది. ఇందుకు కారణం రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ప్రవేశపెట్టిన 2025-2026 బడ్జెట్‌లో తక్కువ నిధులు కేటాయించడమే. ఆరోగ్యశ్రీ సేవల కోసం నెట్‌వర్క్ దవాఖానలకు ఇప్పటికే రూ.1200 కోట్ల బకాయిలు పెండింగ్ ఉండగా, కాంగ్రెస్ ప్రభుత్వం తాజా బడ్జెట్‌లో కేవలం రూ.1143 కోట్లు మాత్రమే కేటాయించింది. ఈ నిధులతో బకాయిలు చెల్లించలేని పరిస్థితి నెలకొన్నది. దీంతో నెట్‌వర్క్ దవాఖానల యాజమాన్యాలు ఆందోళనలో ఉన్నాయి. ఇప్పటికే బకాయిలు చెల్లించకపోవడంతో ఈ ఏడాది జనవరి నుంచి సేవలు నిలిపివేశాయి. ఈహెచ్‌ఎస్, జేహెచ్‌ఎస్ స్కీమ్‌లకు సైతం వైద్య సేవలను ఆపేశాయి. బడ్జెట్ నేపథ్యంలో పెండింగ్ బిల్లులకు నిధులు కేటాయిస్తారనుకున్న వారి ఆశలపై ప్రభుత్వం నీళ్లు చల్లడంతో చిన్న దవాఖానల నిర్వహణ భారంగా మారింది.

అగ్రవర్ణ పేద యువతను ఆదుకోవాలి

- ఈబీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి

హైదరాబాద్, మార్చి 20 (నమస్తే తెలంగాణ): అగ్రవర్ణ కులాల పేద నిరుద్యోగ యువతకు రాజీవ్ యువ వికాసం పథకాన్ని అమలుచేసి ఆదుకోవాలని ఈబీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు వల్లపురెడ్డి రవీందర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నిరుద్యోగ యువతకు రాజీవ్ యువవికాసం ప్రవేశపెట్టిందని.. అయితే అందులో అగ్రవర్ణ పేద నిరుద్యోగ యువతను విస్మరించడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని కులాల పేదలకు సంక్షేమ పథకాలు అందినప్పుడే.. సంక్షేమరాజ్యంగా పిలవబడుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం ఈబీసీ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు.

ఎస్సీ సబ్‌ప్లాన్ నిధుల ఖర్చెట్లా?

- నిధుల ఖర్చుపై అస్పష్టత
- 3 వర్గాలుగా ఎస్సీల విభజన
- జనాభా నిష్పత్తి మేర రిజర్వేషన్లా..?
- గంపగుత్తగా ఆ నిధులను వెచ్చింపా?
- బడ్జెట్‌లో ఆ ఊసెత్తని సర్కార్
- ఏకమొత్తంగానే శాఖలకు కేటాయింపులు

హైదరాబాద్, మార్చి20 (నమస్తే తెలంగాణ): ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై చట్టం చేసిన కాంగ్రెస్ సర్కారు.. సబ్‌ప్లాన్ నిధులను ఖర్చుపెట్టే అంశంపై బడ్జెట్‌లో ఎక్కడా స్పష్టతనివ్వలేదు. ఆయా క్యాటగిరీల వారీగా నిధులను కేటాయిస్తారా? గతంలో మాదిరిగానే గంపగుత్తగా వెచ్చిస్తారా? అనే విషయాన్ని కూడా లేశమాత్రమైనా ప్రస్తావించలేదు. సబ్‌ప్లాన్ బడ్జెట్‌లో ఆయా ప్రభుత్వ శాఖలకు ఏకమొత్తంగానే నిధులను పొందుపరచింది. ప్రస్తుతం ఈ అంశం చర్చనీయాంశంగా మారింది. ఎస్సీ వర్గీకరణ కోసం ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ షెడ్యూల్ కులాలను 3 గ్రూపులుగా విభజించింది. ఆయా గ్రూపుల వారీగా రిజర్వేషన్లను కేటాయించింది. ఆ నివేదిక మేరకు కాంగ్రెస్ సర్కారు ఇటీవలే చట్టం కూడా చేసింది. ప్రస్తుతం విద్యా, ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లోనే కాకుండా ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను ఖర్చు చేయడంలోనూ ఇదే నిష్పత్తిని అమలు చేయాలనే డిమాండ్ సర్వత్రా వ్యక్తమవుతున్నది. అయితే ప్రభు త్వం మాత్రం నిధులను ఖర్చు చేసే అంశాన్ని ఎక్కడా ప్రస్తావించలేదు. ప్రభుత్వం 2017 ఎస్సీ సబ్‌ప్లాన్ చట్టాన్ని అనుసరించి 2025-26 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో మొత్తంగా ప్రగతిపద్దు కింద రూ.1,74,710.69 కోట్లను కేటాయించింది. అందులో ఎస్సీ జనాభా దామాషా ప్రకారం రూ.40,232 కోట్లను కేటాయించింది. వాస్తవంగా సబ్‌ప్లాన్ నిధులను మొత్తంగా అగ్రికల్చర్, విద్యాశాఖ, లేబర్, ఎంప్లాయ్‌మెంట్, హౌజింగ్, సెర్ప్, గ్రామీణాభివృద్ధి, పట్టణాభివృద్ధి, ఆర్‌అండ్‌బీ, ఎస్సీ, హార్టికల్చర్, బీసీ ఇలా మొత్తంగా 34 శాఖల వారీగా పొందుపరించింది.

వర్గీకరణ చట్టం ప్రకారం ఇలా..

ఎస్సీ వర్గీకరణ చట్టం ప్రకారం ఏ గ్రూపులోని 15 కులాలకు 1శాతం అంటే రూ.2682.13 కోట్లను, బీ గ్రూప్‌లోని 18 కులాలకు 9శాతం అంటే రూ. 24139.17 కోట్లు, సీ గ్రూపులోని 26 కులాలకు రూ.13,410.70 కోట్లను వెచ్చించాల్సి ఉంటుంది. ప్రస్తుతం ప్రభుత్వం బడ్జెట్‌లో ఏకమొత్తంగానే సబ్‌ప్లాన్ నిధులను కేటాయించింది. ఆయా శాఖలకు సైతం అదేవిధంగా పొందుపరిచింది. ఎక్కడా వర్గీకరణ చట్టాన్ని, ఆ దామాషా ప్రకారమే వెచ్చించాలనే అంశాన్ని కూడా సబ్‌ప్లాన్ బెడ్జెట్‌లో ప్రస్తావించలేదు. ఈ నేపథ్యంలో నిధుల ఖర్చుపై ఇప్పుడు గందరగోళం నెలకొన్నది. గతంలో మాదిరిగానే ఏకమొత్తంగా సబ్‌ప్లాన్ నిధులను వెచ్చిస్తారా? లేదంటే వర్గీకరణ శాతానికి అనుగుణంగా ఖర్చు చేస్తారా? అనే విషయంలో స్పష్టతలేదు. జనాభా నిష్పత్తి ప్రకారమే ఖర్చు చేయాలని ఇప్పటికే ఆయా ఎస్సీ వర్గాలు డిమాండ్ చేస్తున్నాయి.



2024-25

ఎకరాల భూమిలో గల 106 దుకాణాలతో కూడిన సైట్ బజారు కాంప్లెక్స్ ను అప్పగించాం.

71. మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించినప్పుడే వారు నిజమైన సమానతను సాధిస్తారు. పైన పేర్కొన్న పథకాలన్నీ కూడా ఈ దిశగా మహిళలను బలోపేతం చేసేవే. సంక్షిప్తంగా చెప్పాలంటే మా ప్రభుత్వం కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసేందుకు కంకణం కట్టుకుంది.

పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖకు ఈ బడ్జెట్ లో 29,816 కోట్ల రూపాయలు ప్రతిపాదిస్తున్నాము.

హైదరాబాద్ నగరాభివృద్ధి

72. దేశంలోని ప్రధాన నగరాలలో ఒకటైన హైదరాబాద్ అన్ని రంగాలలో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న చారిత్రాత్మక నగరం. ఇప్పటికే ఈ నగరం ఒక బ్రాండ్ గా పేరు గడించింది. ఈ నగరాభివృద్ధికి విశేషంగా కృషి చేసిన గత కాంగ్రెస్ ప్రభుత్వాల సేవలను మనము మర్చిపోలేము. ఇంతటి ఘన చరిత్ర కలిగిన నగరం యొక్క పరిశుభ్రత, మురుగు నీటి, తాగునీటి వ్యవస్థలు గత పదేళ్ళుగా అత్యంత నిర్లక్ష్యానికి గురయ్యాయి. మితిమీరిన కాలుష్యంతో మూసీ, హుసేన్ సాగర్ లు విషతుల్యం అయ్యాయి. మురికి నీటి కాలువల నిర్వహణ లోపంతో, ఆక్రమణలతో చినుకు పడితే నగరం జలమయమై

36

2025-26

ఇచ్చేందుకు నిర్ణయించాం. ఇప్పటికే 150 బస్సులను అద్దెకు ఇవ్వడం జరిగింది.

79. స్వయం సహాయక సంఘాలకు సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంటుల స్థాపన, నిర్వహణను అప్పగిస్తున్నాము. ఈ సంఘాల ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా సోలార్ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేయడానికి SERP, TGREDCO, TGSPDCL మరియు TGNPDCL మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ ప్రాజెక్టు ద్వారా 1000 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి అవ్వడమే కాకుండా మహిళలకు జీవనోపాధి లభిస్తుంది. కోటి మంది మహిళలకు ఇందిరా మహిళా శక్తి మిషన్ పథకం ద్వారా లక్ష కోట్ల రూపాయల వడ్డీ లేని రుణాలను అందిస్తాము.

పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖకు ఈ బడ్జెట్ లో 31,605 కోట్ల రూపాయలు ప్రతిపాదిస్తున్నాము.

స్త్రీ, శిశు సంక్షేమం:

80. రాష్ట్రంలోని రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థినుల ఆరోగ్యం, సంక్షేమం, భద్రతను మెరుగుపరచేందుకు, పాఠశాలల పనితీరులోని లోపాలను గుర్తించేందుకు మహిళా ఐ.ఏ.ఎస్ అధికారులు వాటిని సందర్శించి, రాత్రిపూట బస చేసేలా ఆదేశాలు ఇచ్చాం. వాటి పనితీరును మెరుగుపరచడానికి తక్షణమే తీసుకోవలసిన చర్యలతో

37



2024-25

...వందల ముప్పై మూడు కోట్ల ఇరవై లక్షల రూపాయలు (433.20 కోట్లు) చెల్లించింది.

27. గృహజ్యోతి పథకం క్రింద 200 యూనిట్లకు లోబడి విద్యుత్తును వినియోగిస్తున్నవారికి ఉచిత విద్యుత్ ను అందిస్తున్నాము. ఈ పథకం క్రింద 50 లక్షల కుటుంబాలు లబ్ది పొందుతున్నాయి. ఈ పథకం కోసం ఇప్పటికే ఒక వెయ్యి ఏడు వందల డెబ్బై ఐదు కోట్ల పదిహేను లక్షల రూపాయలు (1,775.15 కోట్లు) విద్యుత్ సంస్థలకు సబ్సిడీగా చెల్లించడం జరిగింది.

28. ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని 2024, మార్చి నెలలో ప్రారంభించి, ఇండ్ల పట్టాలను ఆడబిడ్డల పేరుతోనే ఇవ్వాలని నిర్ణయించాం. 22,500 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో ప్రతి నియోజకవర్గానికి కనీసం 3,500 చొప్పున మొత్తం నాలుగు లక్షల యాభై వేల (4,50,000) ఇండ్లను మంజూరు చేస్తాం.

29. గత ప్రభుత్వం పదేళ్ల పాటు నిరుపేదలకు డబుల్ బెడ్ రూం ఇండ్లను ఇస్తామని ఆశలు రేకెత్తించి చివరకు నిరాశ మిగిల్చింది. అసంపూర్తిగా నిలిచిపోయిన గృహాలలో ముప్పై నాలుగు వేల ఐదు వందల నలభై ఐదు (34,545) నిర్మాణాలకు, మూడు వందల ఐదు కోట్ల మూడు లక్షల రూపాయల (305.03 కోట్లు) నిధులను కేటాయించి, వాటిని అందుబాటులోకి తెస్తున్నాము. అంతే

12

2025-26

ఈ బడ్జెట్ లో ...18 కోట్ల రూపాయలు ప్రతిపాదిస్తున్నాము.

ఇందిరమ్మ ఇండ్లు:

49. రోటీ, కపడా ఔర్ మకాన్ లలో మకాన్ ఎంతో మంది నిరుపేదలకు ఎండమావే. గూడులేని నిరుపేదలకు గూడును సమకూర్చడం ప్రభుత్వ ప్రధాన కర్తవ్యం. గత ప్రభుత్వం నిరుపేదలకు ఆశలు కల్పించి, వారికి ప్రభుత్వ ఇండ్లు కేటాయించకుండా వారిని దగా చేసింది.

50. అసెంబ్లీ ఎన్నికల మానిఫెస్టోలో పేర్కొన్న విధంగా మా ప్రభుత్వం "ఇందిరమ్మ ఇండ్లు" అనే నూతన గృహ నిర్మాణ కార్య క్రమాన్ని ప్రారంభించి వారి ఆశలు నిజం చేసింది. ఈ పథకం ద్వారా పేదలు ఇండ్లను కట్టుకోవడానికి 5 లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందించాలని నిర్ణయించాం. ఎస్సీ, ఎస్టీ లబ్దిదారులకు 6 లక్షల రూపాయలు చెల్లిస్తాం. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ప్రతి నియోజక వర్గంలో కనీసం 3,500 ఇండ్ల చొప్పున, మొత్తం 4,50,000 ఇండ్ల నిర్మాణానికి సహకారం అందించాలని నిర్ణయించాం. ఈ పథకం కింద నిర్మించే ఇండ్లు కనీసం 400 చదరపు అడుగుల విస్తీర్ణంతో, ఆర్.సి.సి (RCC) కప్పుతో వంట గది, టాయిలెట్ సౌకర్యం కలిగి ఉంటాయి.

27

కాపీ పేస్ట్ బడ్జెట్

రాష్ట్ర సర్కారు నిరుడు ప్రవేశపెట్టిన బడ్జెట్‌లోని అంశాలనే ఈ ఏడాది కూడా కాపీ చేసింది. పలు పథకాలకు సంబంధించిన అంశాలు ఈ బడ్జెట్‌లో పొందుపరిచింది. దీనిపై సోషల్ మీడియాలో పెద్ద చర్చ నడుస్తున్నది. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామని, ప్రతి నియోజకవర్గానికి 3500 ఇండ్ల చొప్పున 4,50,000 ఇండ్ల నిర్మాణానికి సహకారం అందిస్తామని నిరుటి బడ్జెట్‌లో పేర్కొన్నది. ఇదే అంశాన్ని తాజా బడ్జెట్‌లోనూ ప్రస్తావించింది. ఇలాగే అనేక అంశాలు రిపీట్ చేస్తూ అంకెల గారడీతో మభ్యపెట్టింది.

తన క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి గంగుల కమలాకర్

బడ్జెట్ కేటాయింపుల్లో బీసీలకు అన్యాయం

- రేవంత్ మాటలకు కేటాయింపులకు ఎక్కడా పొంతన లేదు
- బీసీలకు జరుగుతున్న అన్యాయంపై పొన్నం ఎందుకు మాట్లాడరు?
- మాజీ మంత్రి గంగుల కమలాకర్

కరీంనగర్, మార్చి 20 (నమస్తే తెలంగాణప్రతినిధి) : బడ్జెట్ కేటాయింపుల్లో బీసీలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మరోసారి తీవ్ర అన్యాయం చేశారని మాజీ మంత్రి గంగుల కమలాకర్ మండిపడ్డారు. చెప్పేమాటలకు, కేటాయింపులకు ఏ మాత్రం పొంతన లేదని ఆరోపించారు. కరీంనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. బీసీ సంక్షేమానికి ఏడాదికి రూ.20 వేల కోట్ల చొప్పున ఐదేండ్లలో రూ.లక్ష కోట్లు కేటాయింపులు చేస్తామని కాంగ్రెస్ తన మ్యానిఫెస్టోలో చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. గతేడాది బడ్జెట్‌లో జరిగిన అన్యాయమే ఈ సారి కూడా జరిగిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. బీసీలంటే అంత వివక్ష ఎందుకని, మ్యానిఫెస్టోను మరువడం ఎంతవరకు కరెక్టు అని ప్రశ్నించారు. ఓవైపు బీసీలకు న్యాయం చేసేందుకు కట్టుబడి ఉన్నామంటూనే మరోవైపు కేటాయింపుల్లో వివక్ష ఎందుకు చూపుతున్నారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతున్న మాటలు.. ఆచరణలో జరుగుతున్న కేటాయింపులు, తద్వారా బీసీ సమాజానికి జరిగే అన్యాయాన్ని పూర్తి స్థాయిలో బీసీ లోకం ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు. బీసీలకు జరుగుతున్న అన్యాయంపై మంత్రి పొన్నం ప్రభాకర్ ఎందుకు మాట్లాడరని ప్రశ్నించారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో చెప్పిన ఏ ఒక్క విషయాన్ని ఇప్పటి వరకు చట్టబద్ధంగా ప్రభుత్వం అమలు చేయలేదని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ 25ఏళ్లు పూర్తిచేసుకుంటున్న సందర్భంగా సిల్వర్ జూబ్లీ ఉత్సవాలకు సంబంధించిన కరీంనగర్ ఉమ్మడి జిల్లా సన్నాహక సమావేశాన్ని ఈనెల 23న కరీంనగర్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనికి బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు పాల్గొంటారని తెలిపారు.

చేనేతకు వెయ్యి కోట్లు కేటాయించాలి

- రాష్ట్ర బడ్జెట్‌లో చేనేతకు తీరని అన్యాయం
- పునఃసమీక్షించి ప్రత్యేక నిధులు కేటాయించాలి
- చేనేత కార్మిక సంఘం డిమాండ్

హైదరాబాద్, మార్చి 20 (నమస్తేతెలంగాణ): రాష్ట్ర బడ్జెట్‌లో చేనేత రంగానికి తీరని అన్యాయం జరిగిందని, పునఃసమీక్షించి వెంటనే రూ.1,000 కోట్లు కేటాయించి చేనేతలను ఆదుకోవాలని తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు తాటి పాముల వెంకట్రాములు, ప్రధాన కార్యదర్శి పాశికంటి లక్ష్మీనరసయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా చేనేత కార్మికుల పోరాటాన్ని ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. గురువారం హైదరాబాద్‌లో వారు మీడియాతో మాట్లాడారు. చేనేతకు, జౌళి(టెక్స్‌టైల్) శాఖకు కలిపి రూ.370 కోట్లు కేటాయిస్తున్నట్టు చెప్పినా అందులో పవర్‌లూమ్‌కు రూ. 237.46 కోట్లు, చేనేత, పవర్‌లూం కలిపి రూ.102.54 కోట్లు, నేతన్న బీమాకు రూ.15 కోట్లు, రాష్ట్ర, జిల్లా కార్యాలయాల నిర్వహణకు రూ.35.83 కోట్లు ప్రతిపాదించారని తెలిపారు. వాస్తవంగా చూస్తే ప్రత్యేకంగా చేనేత అభివృద్ధికి, కార్మికుల సంక్షేమానికి కేటాయింపులు ఏమీ లేవని తెలిపారు. స్వయం సహాయక మహిళా సంఘాలలోని 65 లక్షల మందికి నాణ్యమైన రెండు చీరలు నేయించి ఇస్తామన్న హామీ నెరవేర్చేందుకు నిధులు కేటాయించనందున అటు మహిళలను, ఇటు నేతన్నలను దగా చేయడమేనని విమర్శించారు. చేనేత పరిశ్రమ తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయి చేనేత కార్మికులు ఆత్మహత్యల పాలవుతుంటే ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై లేదాని ప్రశ్నించారు.

ప్రభుత్వ భూములను కాపాడాలని బల్దియా ఎదుట నినాదాలు చేస్తున్న ఎల్లాపూర్ గ్రామస్తులు

ప్రభుత్వ భూములను కాపాడాలి

- ఎల్లాపూర్ గ్రామస్తుల ఆందోళన
- పట్టించుకోకుండా వెళ్లిన మంత్రి కొండా సురేఖ

వరంగల్, మార్చి 20 : గ్రేటర్ పరిధిలోని 66వ డివిజన్‌లోని హసన్‌పర్తి మండలం ఎల్లాపూర్ లో ప్రభుత్వ భూములు కాపాడాలని గ్రామస్తులు బల్దియా బడ్జెట్ సమావేశం జరుగుతన్న సమయంలో ఆందోళనకు దిగారు. బల్దియా సమావేశం నుంచి బయటికి వచ్చిన మంత్రి కొండా సురేఖ, మేయర్ గుండు సుధారాణి, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు ముందే ప్రభుత్వ భూములను కాపాడాలని, అధికారుల తీరు నశించాలని గ్రామస్తులు నినాదాలు చేశారు. మంత్రి కొండా సురేఖ ముందే నినాదాలు చేస్తున్నా పట్టించుకోకుండా కారులో వెళ్లిపోయారు. మంత్రి సురేఖ, ఎమ్మెల్యే నాగరాజు, మేయర్ గుండు సుధారాణి తీరుపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమిని కాపాడలేని ప్రజాప్రతినిధులు ఎందుకని మండిపడ్డారు. ప్రజాప్రతినిధుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎల్లాపూర్‌లోని సర్వే నంబర్ 316లో 4 ఎకరాల15 గుంటల ప్రభుత్వ భూమి ఉందని గ్రామస్తులు తెలిపారు. కొంతమంది కబ్జా చేసేందుకు కుట్రలు చేసిన విషయమై గ్రామస్తులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోపాటు కలెక్టర్, గ్రేటర్ కమిషనర్, ఆర్డీవో, తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. అధికారులు భూ కబ్జాదారులకు వత్తాసు పలుకుతూ ప్రభుత్వ భూమికి నాలా పర్మిషన్ ఇచ్చారని, వెంటనే పర్మిషన్‌ను రద్దు చేసి ప్రభుత్వ భూమిని కాపాడాలని డిమాండ్ చేశారు.

చెప్పేదొకటి.. చేసేదొకటి!

- పొంతన కుదరని పాలకుల మాటలు.. చేతలు..
- మంత్రుల మాటలకు.. బడ్జెట్ కేటాయింపులకు పొంతనలేని వైనం

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, మార్చి 20 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహ మంత్రులు, ఇతర కాంగ్రెస్ నేతలు గత 15 నెలలుగా చెప్తున్నది నిజమా? లేక రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ పద్దులోని అంశాలు నిజమా? ప్రస్తుతం రాష్ట్రంలో ఇదే చర్చ జరుగుతున్నది. తెలంగాణ దివాలా తీసింది, మూలధన వ్యయాన్ని సమకూర్చే పరిస్థితి కూడా లేదంటూ వెళ్లిన ప్రతిచోట ముఖ్యమంత్రి వ్యాఖ్యానిస్తున్నారు. కానీ బడ్జెట్ పద్దు అందుకు పూర్తి విరుద్ధంగా ఉంది. ప్రభుత్వాధినేతలు చెప్తున్నదానికి, బడ్జెట్‌లో పేర్కొన్న అంశాలకు ఎక్కడా పొంతన కుదరడం లేదు.

చెప్తున్నది ఇది..

రాష్ట్ర రైతుల నుంచి కొనుగోలు చేసే సన్న ధాన్యానికి ప్రతి క్వింటాల్‌కు రూ.500 చొప్పున అదనపు ప్రోత్సాహాన్ని (బోనస్) ఇస్తున్నాం. ఈ హామీ అమలు వల్లనే రాష్ట్రంలో సన్నరకాల వరిసాగు 25 లక్షల ఎకరాల నుంచి 40 లక్షల ఎకరాలకు పెరిగింది.

చేస్తున్నది ఇది..

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన బోనస్ వల్లనే రాష్ట్రంలో సన్నరకాల వరిసాగు 25 లక్షల నుంచి 40 లక్షల ఎకరాలకు పెరగటం వాస్తవమే కావచ్చు. అంటే 40 లక్షల ఎకరాల్లో ఎకరాకు కనీసంగా 20 క్వింటాళ్ల ధాన్యం చొప్పున మొత్తం 80 లక్షల మెట్రిక్ టన్నుల సన్నధాన్యం ఉత్పత్తి అవుతుంది. ఈ లెక్కన 2025-26 బడ్జెట్‌లో క్వింటాల్‌కు రూ.500 బోనస్ కింద రూ.4000 కోట్లను కేటాయించాలి. కానీ బడ్జెట్‌లో వరి బోనస్‌కు రూ. 1800 కోట్లు మాత్రమే కేటాయించారు. ఈ లెక్క ప్రకారం 36 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యమే ఉత్పత్తి అవుతుందని అంచనా వేసిందా లేక మిగిలిన ధాన్యానికి బోనస్ ఎగ్గొట్టనున్నారానే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

చెప్తున్నది ఇది..

ప్రజాధనం దుర్వినియోగం కాకుండా, క్షేత్రస్థాయిలో సర్వే చేసి, గ్రామసభల్లో ధ్రువీకరించి, సాగుకుయోగ్యంకాని భూమిని గుర్తించడం ద్వారా ఈ వృథాను అరికట్టాం. రైతుభరోసాకు ఈ బడ్జెట్‌లో రూ.18 వేల కోట్లు ప్రతిపాదిస్తున్నాం.

చేస్తున్నది ఇది..

కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలోని సుమారు 69 లక్షల మంది రైతులకు దాదాపు 1.53 కోట్ల ఎకరాలకు ఈ సాయం అందేది. ఇందుకుగాను కేసీఆర్ సర్కారు ఒక్కో సీజన్‌కు రూ.7,500 కోట్లు విడుదల చేసింది. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసాకు రూ.18వేల కోట్లు కేటాయించింది. అంటే సీజన్‌కు రూ.9వేల కోట్లు.

- ఏడాదికి ఎకరాకు రూ.12వేల చొప్పున ఇస్తామని ప్రకటించినందున సీజన్‌కు ఎకరాకు రూ.6వేల చొప్పున లెక్కిస్తే... 1.50 కోట్ల ఎకరాలకు రూ.9,000 కోట్లు అవుతుంది. అంటే కేసీఆర్ హయాంతో పోలిస్తే మూడు లక్షల ఎకరాలు తగ్గించారు.
- మరి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గతంలో అసెంబ్లీలోనే కేసీఆర్ ప్రభుత్వం రైతుబంధు మొత్తాన్ని దుర్వినియోగం చేసిందని చెప్పారు. కొండలు, గుట్టలు, రోడ్లు ఇలా సాగుకు పనికిరాని భూములకు 2018-23 వరకు రూ.21,283 కోట్లు ఇచ్చారని ఆరోపించారు. ఈ చొప్పున దాదాపు 40 లక్షల ఎకరాల్లో కొండలు, గుట్టలు, రోడ్లు ఉండాలి. కానీ కేవలం మూడు లక్షల ఎకరాలను మాత్రమే ప్రభుత్వం తగ్గించింది. అంటే గ తంలో తుమ్మల చేసిన ఆరోపణ నిజమా? రాష్ట్రంలో సాగుయోగ్యమైన భూమి 1.50 కోట్ల ఎకరాలు ఉందనే బడ్జెట్ కేటాయింపు నిజమా?

చెప్తున్నది ఇది..

‘అబద్ధాల పునాదులపై ప్రభుత్వాన్ని నడపలేను.. ఆకాశసౌధాలు కట్టదలచుకోలేదు.. వాస్తవాల ప్రాతిపదికన నడుచుకుంటాం. ఏది ఉంటే అదే చెప్తాం..’ ఇటీవల అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు.

చేస్తున్నది ఇది..

కాంగ్రెస్ ప్రభుత్వం గత ఏడాది (2024-25) బడ్జెట్‌ను రూ.2.91 లక్షల కోట్లుగా చూపి, తాజాగా 2025-26 బడ్జెట్‌ను రూ.3.04 లక్షల కోట్లుగా చూపారు. సాధారణంగా బడ్జెట్ రూపకల్పనలో ఏటా 15 శాతం వృద్ధిని పరిగణలోనికి తీసుకుంటారు. ఈ క్రమంలో తాజా బడ్జెట్ పరిమాణం రూ.3.35 లక్షల కోట్లుగా ఉండాలి.

మరి.. అబద్ధాల ప్రాతిపదికన ప్రభుత్వాన్ని నడపలేమన్న సీఎం రేవంత్‌రెడ్డి ఏ ప్రాతిపదికన తాజా బడ్జెట్‌ను రూ.3.04 లక్షల కోట్లుగా రూపకల్పన చేశారు.

సీఎం చెబుతున్న ‘తెలంగాణ దివాలా’ నిజమా? మునుపటికంటే బడ్జెట్ పెరిగినందున ఆ మేరకు ఆర్థిక వృద్ధి జరిగిందనేది నిజమా?

ప్రభుత్వ దవాఖానల్లో అధునాతన సౌకర్యాలు

మంత్రి రాజనర్సింహ

హైదరాబాద్, మార్చి 20 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ దవాఖానాల్లో అధునాత సౌకర్యాల కల్పనకు సమగ్ర ప్రణాళికతో ముందుకెళ్తామని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి రాజనర్సింహ పేర్కొన్నారు. గురువారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ దవాఖానల్లో సరిపడా మౌలిక వసతులు, ఔషధాలు, శానిటేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని అధికారులను ఆదేశించారు. టూల్స్ అండ్ ప్లాంట్స్ నిర్వహణ కోసం అన్ని దవాఖానలకు నిధులు కేటాయించాలని సూచించారు. దవాఖానల్లో సరిపడా డాక్టర్లు, నర్సింగ్ సిబ్బందిని త్వరలోనే నియమిస్తామని తెలిపారు. వైద్య విధాన పరిషత్‌ను డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ కేర్‌గా మారుస్తామని ప్రకటించారు. సమీక్షలో వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జడ్ చొంగ్తూ, ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ ఆర్వీ కర్ణన్, టీజీఎంఎస్‌ఐడీసీ ఎండీ హేమంత్, డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ రవీందర్ నాయక్, టీవీవీపీ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు విద్యార్థుల సమస్యలు పట్టవా..?

- విన్నవించినా పట్టించుకోని యశస్వినీరెడ్డి

తొర్రూరు మార్చి 19 : మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం అమ్మాపురం జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం కింద వంట సామగ్రి పంపిణీ కార్యక్రమం నిర్వహించగా, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమం ముగిసిన అనంతరం కొందరు విద్యార్థులు ఎమ్మెల్యేను కలిసి తమ సమస్యలను వివరించారు. మధ్యాహ్న భోజనం సరిగ్గా వండడం లేదని, ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని విద్యార్థులు వాపోయారు. అయితే, విద్యార్థుల ఫిర్యాదును ఎమ్మెల్యే పట్టించుకోలేదు.. కనీసం స్పందించకుండా కారెక్కి వెళ్లిపోయారని స్థానికులు తెలిపారు.

ఫార్ములా రేసు తప్పు... అందాల పోటీలు ఒప్పా?

- ప్రపంచస్థాయి ఈ-రేసుపై బురద ఎందుకు చల్లినట్టు?
- మాజీ మంత్రి కేటీఆర్‌పై కేసు వెనుక ఆంతర్యమేంటి?
- ఫార్ములా ఈ రేసుతో ప్రభుత్వానికి 700 కోట్ల రాబడి
- అందాల పోటీలకు ఖర్చుచేస్తే ఎంత ఆదాయమొస్తది?

హైదరాబాద్, మార్చి 20 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దుతామంటూ పదేండ్లు పాలన సాగించిన బీఆర్‌ఎస్ ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఫార్ములా ఈ-రేసును భాగ్యనగరానికి తీసుకొచ్చింది. ప్రపంచ దేశాలు తెలంగాణ రాజధాని వైపు చూసేలా చేసింది. కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రేసు నిర్వహణలో తప్పులు జరిగాయంటూ సీఎం రేవంత్‌రెడ్డి కొత్త వాదన తెరపైకి తెచ్చారు. ఈవెంట్ నిర్వహణ సంస్థకు రూ.54 కోట్లను నిబంధనలకు విరుద్ధంగా చెల్లించారని ఆరోపించారు. దీంతో మాజీ మంత్రి కేటీఆర్‌పై ఏసీబీ కేసు నమోదు చేసింది. వరుస విచారణలకు పిలిచి, ప్రశ్నలు సంధించింది. కానీ కొండను తవ్వి ఎలుకను కూడా పట్టనట్టు ఏసీబీ ఏమీ తేల్చలేదు. ఇదొక తప్పుడు కేసు అని, లొట్టపీసు కేసు అని కేటీఆర్ పదేపదే చెప్పారు. ఆ కేసు ఏమైందో ఏసీబీకి కూడా తెలియదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మరోవైపు ఈ కేసులో నిధుల దుర్వినియోగం జరగలేదని మంత్రి పొన్నం ప్రభాకర్ తేల్చిచెప్పారు. రాష్ట్రానికి రూ.700 కోట్ల ఆదాయం సమకూర్చిన ఈవెంట్‌ను రద్దు చేయడం ద్వారా కాంగ్రెస్ సర్కారు చేజేతులా ఈ ఏడాది రావాల్సిన ఆదాయానికి తూట్లు పొడిచినట్టయిందని బీఆర్‌ఎస్ నేతలు మండిపడ్డారు. ఈ నేపథ్యంలో ఇప్పుడు కాంగ్రెస్ సర్కారు అందాల పోటీల నిర్వహణకు సిద్ధమైంది. దీంతో ఫార్ములా ఈ-రేసు ఘనత మరోసారి చర్చకు వచ్చింది.

లొట్టపీసు కేసు అని తేలినట్టే కదా !

హైదరాబాద్‌లో అందాల పోటీలు నిర్వహిస్తే తెలంగాణకు అంతర్జాతీయ ఖ్యాతి వస్తుందని ప్రభుత్వం ఆర్భాటపు ప్రకటనలు చేస్తున్నది. పర్యాటక అభివృద్ధి కోసమే అందాల పోటీలు అంటున్నది. మంత్రి జూపల్లి కృష్ణారావు మరో అడుగు ముందుకు వేసి, అందాల పోటీలతో మహిళా సాధికారత సాధ్యమని చెప్తున్నారు. అందాల పోటీలకు పెద్దగా విశిష్టత ఏమీ లేదు. కానీ ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఫార్ములా ఈ-రేసింగ్ భారత్‌లో తొలిసారి, అదీ హైదరాబాద్‌లో జరిగితే మనకు ఖ్యాతి వచ్చినట్టు కాదా? అవినీతి జరిగినట్టా? అంటూ బీఆర్‌ఎస్ నేతలు, సామాజిక మాధ్యమాల్లో నెటిజన్లు ప్రశ్నలు సంధిస్తున్నారు. బీఆర్‌ఎస్ హయాంలో రూ.700 కోట్లు ఆదాయం తీసుకొచ్చే ఈవెంట్‌కు రూ.54 కోట్లు ఇస్తే అవినీతి అన్నారు, పైసా ఆదాయం లేని అందాల పోటీలను రూ.54 కోట్ల వ్యయంతో నిర్వహించడం, అందులో సగం సర్కారు భరించడం వల్ల ఉపయోగమేంటని ప్రశ్నిస్తున్నారు. దీన్ని బట్టి కేవలం బురదజల్లేందుకు మాత్రమే కేటీఆర్‌పై కేసు పెట్టినట్టు తేలింది కదా అని నిలదీస్తున్నారు.

నేటుగా కొంతే.. చాటుగా ఎంతో!

అందాల పోటీలకు ప్రభుత్వం ఆతిథ్యమివ్వడం, ప్రజాధనాన్ని వెచ్చించడం పట్ల విపక్షాలు, మహిళా సంఘాల నేతలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తప్పుడు లెక్కలు చెప్తున్నదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. రేవంత్‌రెడ్డి సర్కారు అందాల పోటీలకు రూ.250 కోట్లు ఇస్తూ, లెక్కలు దాస్తున్నదని ప్రతిపక్ష పార్టీల నేతలు విమర్శిస్తున్నారు. మహిళలకు నెలకు రూ.2,500 సహా ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని దేవుళ్లపై ఒట్టుపెట్టిన రేవంత్‌రెడ్డి అధికారంలోకి రాగానే నిధులు లేవంటూ మాట తప్పారని మండిపడుతున్నారు. అంగన్‌వాడీ సిబ్బందికి పూర్తి జీతాలు ఇవ్వకుండా వేధిస్తున్న సర్కారు అందాల పోటీలకు నిధులెలా ఇస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. అంగన్‌వాడీలలో ఏండ్ల తరబడి పని చేసి ఉద్యోగ విరమణ పొందిన వారికి రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం రూ.50 కోట్లు ఇవ్వడానికి కూడా ముప్పుతిప్పలు పెడుతున్న ప్రభుత్వానికి అందాల పోటీలకు నిధులు ఎక్కడి నుంచి వచ్చాయని నిలదీస్తున్నారు. మహిళలకు వడ్డీ లేని రుణాలు ఇవ్వకుండా, కనీసం బతుకమ్మ చీరలు కూడా పంపిణీ చేయకుండా అందాల పోటీలు నిర్వహించడాన్ని మహిళా సాధికారతకు నిదర్శనంగా చూడాలని మంత్రి ప్రకటించడం దారుణమని ఎస్‌హెచ్‌జీ ప్రతినిధులు నిప్పులు చెరుగుతున్నారు. సర్కారు తీరు..కడుపు గంజికి ఏడిస్తే.. సిగ మల్లెపూలకు ఏడ్చినట్టుగా ఉందని ఎద్దేవా చేస్తున్నారు.

అందాల పోటీలా.. ఆరు గ్యారెంటీలా?

అందాల పోటీలు నిర్వహించవద్దంటూ గతంలో మహిళలు ఆందోళనలు నిర్వహించిన సంగతి సీఎం రేవంత్‌రెడ్డికి తెలియదా అని తెలంగాణ రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవీప్రసాద్ ప్రశ్నించారు. బీఆర్‌ఎస్‌పై రేవంత్ విషప్రచారం చేయడం దుర్మార్గమని, అందాల పోటీలు వద్దంటే ఎదురుదాడి చేయడమేంటని నిలదీశారు. రాష్ట్ర ప్రజలకు కావాల్సింది అందాల పోటీలు కాదని, ఆరు గ్యారెంటీల అమలు అని తెలిపారు. ప్రభుత్వ విధానాలను ప్రశ్నించిన కేటీఆర్ ఇంటి తలుపులను విధ్వంసం చేస్తామంటూ బెదిరించడం కాంగ్రెస్ పార్టీ ఏడో గ్యారెంటీనా అని ప్రశ్నించారు. కాంగ్రెస్‌కు ఓటేసిన ప్రజలు పునరాలోచనలో పడ్డారని, కాంగ్రెస్ సర్కారురు ప్రజలే సరైన సమాధానం చెప్తారని హెచ్చరించారు.

మహిళా సాధికారతకు ప్రతీక.. అందాల పోటీలు

వివరాలు వెల్లడించిన పర్యాటక మంత్రి జూపల్లి

హైదరాబాద్, మార్చి 20 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో 72వ ప్రపంచ అందాల పోటీలకు రాష్ట్ర ప్రభుత్వం అతిథ్యం ఇవ్వాలని నిర్ణయించినట్టు పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. మే 7 నుంచి 31 వరకు రాష్ట్రంలోని 20 ప్రాంతాల్లో 24 ఈవెంట్లు నిర్వహించనున్నట్టు చెప్పారు. ఈవెంట్ల కోసం ఖర్చయ్యే రూ.54 కోట్లలో ప్రభుత్వం, నిర్వాహకులు సగం సగం భరించనున్నట్టు చెప్పారు. ఈ మేరకు హైదరాబాద్ టూరిజం ప్లాజాలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో జూపల్లి మాట్లాడుతూ ‘అందాల పోటీలు మహిళా సాధికారతకు ప్రతీక’గా చూడాలని సూచించారు. పోటీలకు 140 దేశాల ప్రతినిధులు హాజరువుతారని, ప్రపంచం దృష్టి తెలంగాణపై పడుతుందని తెలిపారు. అందాల పోటీల వల్ల ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని చెప్పారు. ఈ సమావేశంలో పాల్గొన్న 2024 ప్రపంచ సుందరి క్రిస్టినా పిజ్కోవా మాట్లాడుతూ భారతీయ సంస్కృతి చాలా గొప్పదని కొనియాడారు. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి వారిని సందర్శించడం చాలా మంచి అనుభూతినిచ్చిందని సంతోషం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో పర్యాటకశాఖ కార్యదర్శి స్మితా సభర్వాల్, తెలంగాణ భాషా, సాంస్కృతికశాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.